సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 6 । మే । 2023



శభాష్ సిస్టర్స్
రాజుపాళెం మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన అక్కా చెల్లెళ్లు అఫ్సానా, సుహానా క్యాన్సర్ పేషెంట్ల కోసం తమ పొడవాటి జుట్టును దానం చేశారు. -IIలో..



ఏపీ సీఎం కప్‌లో జిల్లా క్రీడాకారుల హవా
తిరుపతి నగరంలో నిర్వహించిన ఏపీ సీఎం కప్ క్రీడాపోటీల్లో వైఎస్సార్ జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. -IIలో..



సూర్యప్రభ వాహనంపై లక్ష్మీనరసింహుడు
వెయ్యినూతల కోనలో స్వామివారికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. -IIలో..

న్యూస్‌రీల్

జిల్లాకు వర్ష సూచన

కడప అగ్రికల్చర్: జిల్లాలో రాబోయే నాలుగు రోజుల్లో పలు మండలాల్లో చిరుజల్లులతో పాటు తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని కృషి విజ్ఞానకేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, వాతావరణ విభాగ శాస్త్రవేత్త స్వామి చైతన్యలు తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

నేడు కౌన్సెలింగ్

కడప రూరల్: ఎన్‌బీఎస్‌యూ (ఎన్‌హెచ్‌ఎం) కింద స్టాఫ్ నర్స్ పోస్టులకు సంబంధించి అభ్యర్థుల ఫైనల్ మెరిట్ జాబితా ప్రకారం షార్ట్ లిస్ట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఈ జాబితాను డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.కడప.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్ సైట్‌లో ఉంచామన్నారు. ఎంపికైన వారికి ఈ నెల 6వ తేదీన కడపలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని తెలిపారు.

దెబ్బతిన్న వరి పొలాల పరిశీలన



ప్రొద్దుటూరు : మండలంలోని చెన్నమరాజుపల్లె గ్రామంలో శుక్రవారం అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పొలాలను జిల్లాకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారి మురళీధర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పరిశీలించారు. గ్రామ రైతులతో వారు మాట్లాడి ఎన్ని ఎకరాలు వరి పంట వేశారు, ఎంత శాతం నష్టం జరిగింది వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి నివేదిక అందించి, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివశంకర్‌రెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్ : కడప నగరం శంకరాపురంలోని ప్రభుత్వ అంధ బాలుర వసతి గృహంలో 1 నుంచి 10వ తరగతి చదవుతున్న అంధ విద్యార్థుల అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కృష్ణ కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు పొందిన వారికి బ్రెయిలీ లిపిలో ప్రత్యేక బోధన, ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం, కాస్మోటిక్స్ చార్జీలు, నాలుగు జతల బట్టలు, ప్లేటు, గ్లాసు, ట్రంకు పెట్టె అందించనున్నట్లు చెప్పారు. వసతి గృహంలో 100 మందికి మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. దరఖాస్తులను వసతి గృహం వార్డెన్‌కు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 73964 12434 నంబరులో సంప్రదించాలన్నారు.

నిలకడగా టమాటా ధర



కడప అగ్రికల్చర్: టమాటా ధర రోజుకో రకంగా ఉండేది. 20 రోజులుగా కిలో రూ. 5 నుంచి రూ.10కి ఉంది. మధ్యలో కిలో రూ. 8తో అమ్మారు.. అయితే నాలుగు రోజుల నుంచి ధర నిలకడగా ఉంది. కిలో రూ. 10 కొనసాగుతుంది. ధర దగ్గడంతో చాలా చోట్ల వ్యాపారులు ఆటోల్లో టమాటాలు విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులు రైతు బజార్‌కు, మార్కెట్లకు వెళ్లకుండా ఆటోల వద్ద టమాటా కొనుగోలు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు ప్రత్యేక శాఖ కావాలి



మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

కడప రూరల్: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులకు సంబంధించి ప్రత్యేకంగా ఒక శాఖను ఏర్పాటు చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నాటి కాంగ్రెస్, నేటి భారతీయ జనతా పార్టీ పాలనకు సంబంధించి గడిచిన 42 ఏళ్లలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వ్యయంపై విచారణ చేపట్టాలని అన్నారు. ఇందుకు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖకు నిధులను కేటాయించడంతో పాటు ప్రత్యేకంగా ఒక శాఖను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వాలు మాదిగల సంక్షేమానికి ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని కోరారు. మాదిగల అభివృద్ధి, భవిష్యత్ కార్యచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీన మార్కాపురంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సమావేశంను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు పీ ఆంజనేయులు, జిల్లా నేతలు పీవీ రమణ, రామయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అద్వితీయం

- ముమ్మరంగా రెండో విడత నాడు–నేడు పనులు
- రూ.296.62 కోట్లతో చకచకా పనులు
- ప్రభుత్వ పాఠశాలలకు సమకూరుతున్న మౌలిక వసతులు



కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడు- నేడు అభివృద్ధి పనులు

నాడు మనబడి నేడు

కడప ఎడ్యుకేషన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే విద్యారంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. కనీవిని ఎరుగని రీతిలో ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించారు. వీటితోపాటు విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వస్తువులను ఇవ్వడంతోపాటు బోధనలో వినూత్న పద్ధతులను అవలంబిస్తూ విద్యాభివృద్ధికి ఆహర్నిశలు కృషి చేస్తున్నారు. నాడు- నేడు ద్వారా పాఠశాలల్లో ఫర్నీచర్, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రహారీలు, శుద్ధనీరు. గ్రీన్‌చాక్ బోర్డు, ఇంగ్లీషుల్యాబ్‌లతో కళకళలాడుతున్నాయి. వీటితోపాటు ప్రస్తుతం రెండో విడతలో ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలోపాటు అంగన్ వాడీ కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనులు జూన్ 1వ తేదీ నాటికి పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే తొలి విడత రూ. 270 కోట్ల ఖర్చుతో వెయ్యి పాఠశాలలను అందంగా తీర్చిదిద్దగా తాజాగా రెండో విడత కింద రూ. 296.62 కోట్లతో మరో 1006 ప్రభుత్వ పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో పనులు జరుగుతున్నాయి.

రెండవ విడతలో...

జిల్లావ్యాప్తంగా రెండో విడత కింద 87 అంగన్‌వాడీ కేంద్రాలు, 638 ప్రాథమిక పాఠశాలలు, 75 ప్రాథమికోన్నత పాఠశాలలు, 197 హైస్కూల్స్, 9 జూనియర్ కళాశాలలు మొత్తం 1006 వాటిల్లో అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారు. రూ. 296.62 కోట్ల ఎస్టిమేట్‌తో పనులు చేపట్టగా ఇందుకు సంబంధించి రూ.92.82 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఇప్పటి వరకు రూ. 66.75 కోట్లు ఖర్చు చేసి పేరెంట్ కమిటీ విద్యాశాఖ ద్వారా సివిల్ పనులు 90 శాతం మేర పూర్తి చేశారు. ప్రస్తుతం జరుగుతున్న నాడు నేడు పనుల ప్రొగ్రెస్‌లో రాష్ట్రంలో వైఎస్సార్ జిల్లా 5వ స్థానంలో ఉంది.

- మొన్నటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేపట్టిన నాడు- నేడు పనులను రెండో విడతలో మరో అడుగు ముందుకేసి అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల్లో కూడా చేపట్టారు.

ఐదు ఇంజినీరింగ్ డిపార్టుమెంట్లతో పనులు...

కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో చేపట్టిన నాడు- నేడు పనులను ఐదు ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ల అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. ఇందులో పీఆర్, ఎస్ఎస్ఏ, పీహెచ్ఈడీ, ఏపీఈడబ్ల్యూడిసి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ వారు పనులను చేపట్టారు. ఇందులో 108 స్కూళ్లలో పంచాయతీరాజ్ డిపార్టుమెంట్, 69 పాఠశాలల్లో సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ డిపార్టుమెంట్, మరో 193 స్కూళ్లలో పబ్లిక్ హెల్త్ అండ్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్, మరో 218 పాఠశాలల్లో ఏపీఈడబ్ల్యూడీసీ, 319 స్కూళ్లలో ఆర్‌డబ్ల్యూఎస్ వారు నిధులు ఖర్చు చేసి దాదాపు 90 శాతం మేర పనులను పూర్తి చేశారు.

కేటగిరి	సంఖ్య	ఎస్టిమేట్‌కాస్టు (రూ.లక్షల్లో)	విడుదలైన నిధులు (రూ.లక్షల్లో)	ఖర్చుచేసినది (రూ.లక్షల్లో)
ఏడబ్ల్యూసీ	87	1385.47	365.95	251.05
ప్రైమరీ	638	9803.26	3093.95	2246.07
యూపీ	75	1591.40	543.64	412.74
హైస్కూల్స్	197	16153.51	5055.55	3598.93
కాలేజీలు	09	709.25	223.52	166.74

గడువులోగా పనుల పూర్తికి కృషి



జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన రెండోవిడత నాడు- నేడు పనులు జూన్ 1వ తేదీ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.ఎక్కడా ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా పనులను పర్యవేక్షిస్తున్నాం. మాతో పాటు పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలు, ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. నిర్ణీత గడువులోపు పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.
– అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి



సీకేదిన్నె మండలం జి. కొత్తపల్లిలో జరుగుతున్న అదనపు తరగతి గదులు నిర్మాణం



చాపాడు మండలం నరహరిపురం ప్రాథమిక పాఠశాలకు సిద్ధమైన పాఠశాల ఆర్చి

రెండో విడతలో చేపట్టనున్న పనుల వివరాలు..

1 తాగునీటి సరఫరా
2. నిరంతర నీటి సరఫరాతో మరుగుదొడ్లు
3. మేజర్, మైనర్ మరమ్మతులు
4. లైట్లు, ఫ్యాన్‌లతో సహా విద్యుద్దీకరణ
5. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఫర్నీచర్
6. తరగతి గదులకు పెయింటింగ్
7. గ్రీన్ చాక్ బోర్డులు
8. వంటగది నిర్మాణం
9. ప్రహారీ గోడలు
10. ఆదనపు తరగతి గదుల నిర్మాణం



శిశు ఆధార్ నమోదు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్ : పుట్టిన ప్రతి శిశువుకు వెంటనే ఆధార్ నమోదు చేయించడంతోపాటు ఐదేళ్లు పూర్తయిన తర్వాత బయోమెట్రిక్ నమోదు చేయించే విధంగా ప్రజల్లో అవగాహన పెంచాలని డీఆర్వో గంగాదర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎస్‌పీసీ హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలకు ఐదేళ్ల నాలుగు నెలలు పూర్తయిన తర్వాత ఫింగర్ ప్రింట్‌తో బయోమెట్రిక్ సీడింగ్ చేయించాలన్నారు. పది సంవత్సరాలకు ఆధార్ వివరాలు అప్‌డేట్ చేయాన్నారు. ఆ దిశగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయాలు, పోస్టాఫీసులు, జాతీయ బ్యాంకుల్లో ఆధార్ నమోదు, అప్‌డేట్ సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదేళ్లకు ఒకసారి ఆధార్ డేటా అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. 18 ఏళ్లలోపు ఉన్న వారి ఆధార్ నమోదు నవీనకరణ వంద శాతం పూర్తయ్యేలా చూడాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆధార్ పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. 15 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ అప్‌డేట్ ఉచితంగా రెండుసార్లు చేయవచ్చని చెప్పారు. వివరాలకు టోల్‌ఫ్రీ నెంబరు 1947లో సంప్రదించాలన్నారు. ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటేనే భవిష్యత్తులో సంక్షేమ పథకాలు పొందేందుకు వీలు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డి, ఐసీడీఎస్‌పీడీ ఎంఎన్ రాణి, డీఎస్‌డబ్ల్యుఓ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నందబాలుడి ఆనంద విహారం



తెప్పపై ఉన్న స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు



విశేష అలంకారంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరుడు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ తెప్పోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లు తెప్పపై విహరించారు. ఆలయం అర్చుకులు తొలుత ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు తిరుమంజన అభిషేకం నిర్వహించారు. అనంతరం పల్లకీపై స్వామికి సమీప వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. తమ ఇళ్ల వద్దకు తరలివచ్చిన దేవతామూర్తులను దర్శించుకుని భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి మొక్కుకున్నారు. అనంతరం మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు ఉత్సవ మూర్తులను తీసుకొచ్చి అలంకరించి పూజలు చేసి తెప్పపై కొలువుదీర్చారు. మూడుమార్లు వేద పండితుల మంత్రోచ్ఛాటనలు, రెండుసార్లు మంగళ వాయిద్యాల సుస్వరాలు, మరో రెండుసార్లు అన్నమాచార్య కీర్తనల మధ్య తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు తివిక్రమ్ బృందం పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కుటుంబానికి ఆసరాగా నిలవాలి

- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి
- నలుగురికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామకాలు పొందిన వారితో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : విధి నిర్వహణలో పలు కారణాలతో మృతి చెందిన కుటుంబాలకు సంబంధించిన నలుగురికి శుక్రవారం జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. వీరిలో ఎస్.సుష్మకు మద్దనూరు మండలం కొర్రపాడు గ్రామంలోని జెడ్పీ హైస్కూలులో జూనియర్ అసిస్టెంట్‌గా నియామక పత్రం ఇచ్చారు. అలాగే ఎర్రగుంట్ల మండలం చిలంకూరు హైస్కూలులో జూనియర్ అసిస్టెంట్‌గా పి.పరిమళ, రామాపురం మండల ఎంపీపీ కార్యాలయ సబార్డినేట్‌గా కె.రెడ్డెమ్మ, కడప నగరం చెమ్ముమియాపేట జెడ్పీ హైస్కూలు ఆఫీసు సబార్డినేట్‌గా ఎస్.మహమ్మద్ అర్షియాకు కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ కారుణ్య నియామకాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగంతో తమ కుటుంబాలకు ఆసరాగా నిలువాలని సూచించారు.

ఆకేపాటి హయాంలో 59 నియామకాలు

జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఆకేపాటి అమర్‌నాథరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత కారుణ్య నియామకాలకు ప్రాధాన్యత ఇచ్చారు. 2021 సెప్టెంబరు నుంచి నేటి వరకు 59 మందికి పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగాలు ఇచ్చారు. జూనియర్ అసిస్టెంట్లుగా 8మంది, టైపిస్టులు 8, ఆఫీసు సబార్డినేట్లు 42, వాచ్‌మెన్ 1 వెరసి 59 మంది వీరిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, ఏఓ రంగాచార్యులు, చైర్మన్ పీఏ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచులకు 'పెళ్లికానుక'

- కల్యాణమస్తు, షాదీతోఫాలను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ విజయరామరాలజు
- జిల్లాలో 455 జంటలకు రూ. 3.58 కోట్లు జమ



మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ విజయరామరాజు, తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: పేదింటి ఆడపిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే..అపురూపమైన గొప్ప కానుకలు.. వైఎస్సార్ షాదీ తోఫా, కల్యాణమస్తు పథకాలు అని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అభివర్ణించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ కల్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకం రెండవ విడత ఆర్థిక సాయాన్ని.. తాడేపల్లి లోని క్యాంపు కార్యాలయం నుండి శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా బటన్ నొక్కి.. లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు.ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్, రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు సయ్యద్ హిదాయత్, మెప్మా పీడీ రామ్మోహన్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆనందనాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం వైఎస్సార్‌కల్యాణమస్తు, షాదీతోఫాల కింద జిల్లాలోని 455 జంటలకుగాను విడుదలైన రూ. 3,58,25,000 మెగా చెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏడాదిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ పథకానికి సంబంధించిన అర్హులను ఎంపిక చేసి వారి ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేస్తోందన్నారు. పెళ్లయిన 60 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు

జిల్లాలో 455 జంటలకు సాయం

మొదటి విడతగా 257 మంది లబ్ధిదారులకు రూ. 2,20,10,000 ప్రభుత్వం ఇప్పటికే జమ చేసింది. ఇప్పుడు రెండో విడతకింద 210 మంది బీసీ కులాలకుచెందిన వారికి రూ. 1,07,25,000 జమ చేసింది. ఇందులో తొమ్మిది మంది కులాంతర వివాహాలు చేసుకున్న వారు ఉన్నారు. ఎనిమిది మంది దివ్యాంగులకు రూ.12 లక్షలు, 75 మంది మైనార్టీలకు రూ. 75 లక్షలు జమ చేశారు. షెడ్యూల్ కులాలకు చెందిన 159 మందికి రూ. 1,60,80,000 జమ చేశారు. ఇందులో తొమ్మిది మంది కులాంతర వివాహితులు ఉన్నారు. ఇక ముగ్గురు ఎస్టీలకు రూ. 3,20,000 జమ చేయగా, ఇందులో ఒకరు కులాంతర వివాహం చేసుకున్న వారు ఉన్నారు. ఇలా మొత్తం 455 జంటలకు రూ.3,58,25,000 జమ చేశారు.

తోఫా అందుకోవడం సంతోషం



రాష్ట్ర ప్రభుత్వం మాకు వైఎస్సార్ షాదీతోఫా కింద రూ. లక్ష నగదు జమ చేయడం చాలా సంతోషకరం. పేదరికంలో ఉన్న మా తల్లిదండ్రులకు ఇది ఉపయోగకరం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం. – రిజ్వానా, నకాష్, కడప

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



మా కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు అందుతున్నాయి. నేను ఎంఏ వరకు చదువుకున్నాను. మేము ముగ్గురం ఆడపిల్లలం. వైఎస్సార్ కల్యాణమస్తు పథకం కింద నా తల్లిదండ్రుల ఖాతాల్లో రూ. లక్ష జమకావడం వారికి ఎంతో తోడ్పాటు అందించినట్లయింది. ఇందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. – బి.గంగావతి, మాసాపేట, కడప

ఆర్థికంగా ఆదుకున్నారు



మాది పేద కుటుంబం. నేను ఎమ్మెస్సీ చదివాను. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగానే జనవరి 28న వివాహం జరిగింది. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన వైఎస్సార్ కల్యాణమస్తు పథకం ద్వారా రూ. లక్ష నగదు జమ చేశారు. ఆర్థికంగా ఆదుకున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.
– ఎస్.జీవనసంధ్య, అశోక్‌నగర్, కడప

తల్లిదండ్రులకు ఆర్థిక ఆసరా



మా కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సాయాలు అందుతున్నాయి. ఇంటర్మీడియేట్ చదువుకున్న నేను వివాహమై అత్తారింటికి వెళ్లిపోయాను. షాదీతోఫా కింద ప్రభుత్వం రూ. లక్ష అందించడం మా తల్లిదండ్రులకు ఆర్థిక ఆసరాగా నిలుస్తోంది.
– ఖుషియా భాను, రవీంద్రనగర్, కడప

బాధితుల నుంచి వివరాల సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

ప్రొద్దుటూరు : ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నిరుద్యోగులను మోసం చేసిన సంఘటనపై సాక్షిలో గురువారం 'పాత్రధారి సరే.. సూత్రదారులెవరు?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ విజయరామరాజు విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రమోహన్‌ను నియమించారు. ఆయన శుక్రవారం ప్రొద్దుటూరు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఈ సంఘటనకు సంబంధించి ప్రధానంగా ఫిర్యాదు చేసిన గౌసియా బేగంతోపాటు ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాలకు చెందిన బాధితులను పిలిపించి ఎవరెవరితో ఎంత డబ్బు తీసుకున్నారు, ఏవిధంగా మోసం చేశారు అనే వివరాలను సేకరించారు.

21న తీర్థయాత్ర స్పెషల్ బస్సు



మదనపల్లె సిటీ: వేసవి సెలవులు పురస్కరించుకుని ఈనెల 21న తీర్థయాత్ర స్పెషల్ బస్సు నడపుతున్నట్లు ఆర్టీసీ వన్ డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి నందలూరు, ఒంటిమిట్ట, దేవుని కడప, బ్రహ్మంగారిమఠం, శ్రీశైలం, మహానంది, నందవరం, యాగంటి, రవ్వలకొండ, ఆహోబిలంలను సందర్శించవచ్చన్నారు. 21న ఉదయం డిపో నుంచి బయలుదేరి మరుసటి రోజు 22న మదనపల్లెకు చేరుతుందన్నారు. టిక్కెట్టు రానుపోను రూ.2000 ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఎఎం(టి) 7382875034, టీ–2, 7382876634 నంబర్లో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

ఇరువర్గాల మధ్య ఘర్షణ

కాశినాయన : మండలంలోని గంగనపల్లె గ్రామంలో శుక్రవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాలు ఆర్థిక లావాదేవీలపై మాటకుమాట పెరిగి ఘర్షణ పడ్డారని, ఇద్దరికి గాయాలయ్యాయని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఒక వర్గంలోని ఏడుగురిపై, మరో వర్గంలోని 8 మందిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు కింద పడి మహిళ మృతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద గల రైల్వే యార్డు ఎగువ భాగాన గూడ్స్ రైలు కిందపడి ఓ మహిళ మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ రారాజు తెలిపారు. సుమారు 50 ఏళ్ల వయసు గల ఈ మహిళ ఆచూకీ తెలియరాలేదని, మృతదేహాన్ని కడప రిమ్స్ మార్చురీకి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

చెరువులో గుర్తుతెలియని మృతదేహం

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని చెరువులో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు స్థానిక పోలీసులు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు... ఒంటిమిట్ట చెరువులో చిన్న అలుగు వద్ద శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం తేలియాడుతుండటం చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వారు చేరుకుని, మృతదేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ మధుసూదన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుందూలో జారి పడి వృద్ధుడి మృతి


మృతి చెందిన గుర్రప్ప

రాజుపాళెం : మండల పరిధి వెల్లాల గ్రామ సమీపంలోని కుందూనదిలో కాలకృత్యాలకు వెళ్లిన వృద్ధుడు జారి పడి మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ప్రొద్దుటూరులోని శాస్త్రినగర్‌కు చెందిన బండ గుర్రప్ప (61) అనే వృద్ధుడు తమ కుటుంబ సభ్యులతో కలిసి వెల్లాలలోని ఆలయాలకు వచ్చారు. ఈ క్రమంలో గుర్రప్ప కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని కుందూనది వద్దకు వెళ్లాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు జారి నీటిలో పడిపోయాడు. కొద్ది సేపటికి గుర్రప్ప శవమై తేలినట్లు అక్కడున్న వారు చెప్పారు. విషయం తెలుసుకున్న భార్య, కుమారులు బోరున విలపించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ మేరకు రాజుపాళెం ఎస్ఐ రాజగోపాల్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

శభాష్ సిస్టర్స్

- క్యాన్సర్ రోగుల కోసం జుట్టు దానం
- స్టార్ ఫౌండేషన్‌కు అందజేత


కత్తిరించిన జడలను స్టార్‌ఫౌండేషన్ అధ్యక్షుడు సిరాజ్‌కు అందజేస్తున్న అక్కాచెల్లెళ్లు

రాజుపాళెం : ఆడపిల్లలు తమ జడలను అపురూపంగా చూసుకుంటారు. ఒక్క వెంట్రుక రాలిపోతున్నా ఎంతో మనోవేదనకు గురవుతారు. క్యాన్సర్ బారిన పడిన వారికి కీమోథెరపీ ఇవ్వడం కారణంగా తల వెంట్రుకలు పూర్తిగా ఊడిపోయి గుండు ఏర్పడుతుంది. ఇలాంటి వారికి తల వెంట్రుకలు దాదాపుగా తిరిగి రావు. ఒక వైపు క్యాన్సర్ మహమ్మారి సోకిందనే వేదన.. మరోవైపు ఎంతో అపురూపంగా చూసుకున్న తలవెంట్రుకలు పోయి అందవిహీనంగా మారామనే బాధ వారిని తీవ్రంగా కలచి వేస్తుంది. ఇలాంటి వారికి కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు విగ్గులు తయారు చేసి ఉచితంగా అందిస్తున్నాయి. క్యాన్సర్ పేషెంట్ల కోసం మేము సైతం అంటూ అక్కాచెల్లెళ్లు తమ పొడవాటి జుట్టును దానం చేశారు.

పుట్టిన రోజు సందర్భంగా..

రాజుపాళెం మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన అప్సానా, సుహానా అక్కాచెల్లెళ్లు. క్యాన్సర్ పేషెంట్ల కోసం పలువురు యువతులు, బాలికలు జుట్టు దానం చేసిన వీడియోలను వారు ఇటీవల సోషల్ మీడియాలో చూశారు. చూసిందే తడవుగా తాము కూడా తమ వంతుగా క్యాన్సర్ బాధితులకు జుట్టు ఇచ్చి సాయపడేందుకు నిర్ణయించుకున్నారు. సుహానా జన్మదినం సందర్భంగా శుక్రవారం చెల్లెలుతోపాటు అక్క అప్సానా కూడా జుట్టును దానం చేయడం విశేషం. కత్తిరించిన ఇరువురి జడలను ప్రొద్దుటూరులోని స్టార్ ఫౌండేషన్ అధ్యక్షుడు సిరాజ్‌కు అందజేశారు. చిన్నారుల్లో కలిగిన మంచి ఆలోచనను ఆయన అభినందించారు. కురులను క్యాన్సర్ పేషెంట్ల కోసం హైదరాబాద్‌లోని ప్రముఖ స్వచ్ఛంద సంస్థకు పంపనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వీరి మాదిరే జుట్టును దానం చేసి క్యాన్సర్ పేషెంట్లకు సాయపడాలని ఆయన కోరారు.

సూర్యప్రభ వాహనంపై లక్ష్మీనరసింహుడు


సూర్యప్రభ వాహనంపై స్వామి వారి ఊరేగింపు

పెండ్లిమర్రి : మండలంలోని వెయ్యినూతల కోన క్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం స్వామి వారికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ, శ్రీచక్ర పెరుమాళ్ సేవ, రాత్రి గరుడ సేవ వంటి కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో పలువురు దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు కల్యాణం, చక్రస్నానం

బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజు శనివారం లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారికి ఉదయం 9 గంటలకు వైభవంగా కల్యాణం, మధ్యాహ్నం చక్రస్నానం, గజవాహన సేవ, సాయంత్రం ధ్వజ అవరోహణం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పి.నరసింహా హరిప్రసాద్ తెలిపారు. కల్యాణానికి భక్తులు తరలివచ్చి కనులారా తిలకించాలని ఆయన కోరారు.

శేషవాహనంపై దేవదేవుడు


చిన్న శేషవాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

జమ్మలమడుగు : పట్టణంలో నారాపురస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. తిరుమల తిరుపతికి చెందిన వేద పండితులు స్వామి వారికి ప్రతి రోజు ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం స్వామి వారిని చిన్న శేష వాహనంపై పురవీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం హంస వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. పట్టణం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. శనివారం ఉదయం స్వామి వారు ముత్యపు పందిరిపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో తగ్గిన నేరాలు

త్రైమాసిక గణాంకాలను విడుదల చేసిన ఎస్పీ

కడప అర్బన్ : జిల్లాలో గత ఏడాది త్రైమాసికంతో పోలిస్తే మెరుగైన, సమర్థవంతమైన 'పీపుల్స్ ఫ్రెండ్లీ పోలిసింగ్'తో నేరాలలో గణనీయమైన తగ్గుదల నమోదైనట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ముమ్మరంగా గస్తీ నిర్వహించడంతోపాటు కమాండ్ అండ్ కంట్రోల్ సిబ్బంది నిరంతరం నిఘా వుంచడం వల్ల చోరీ కేసుల్లో భారీ తగ్గుదల నమోదైందని తెలిపారు.

- 2022 జనవరి నుంచి మార్చి వరకు 111 చోరీ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకూ కేవలం 59 కేసులు నమోదయ్యాయని, 47 శాతం తగ్గుదలగా నమోదైనట్లు వివరించారు.
- శరీర ఘాత నేరాలకు సంబంధించి గత ఏడాది తొలి త్రైమాసికంలో 228 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది తొలి మూడు నెలల్లో 47 శాతం తగ్గి కేవలం 121 కేసులు నమోదయ్యాయన్నారు.
- హైవేలు, ప్రధాన రహదారుల్లో వాహనాల తనిఖీలు, గతంలో రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్)గా గుర్తించడంతో పాటు హైవే పెట్రోలింగ్‌తో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయన్నారు. గత ఏడాది త్రైమాసికంలో 225 రోడ్డు ప్రమాద కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 140 కేసులు నమోదయ్యాయన్నారు.
- జిల్లాలో 'దిశ'యాప్‌పై మహిళల్లో అవగాహన కల్పించడంతోపాటు డౌన్‌లోడ్ చేయించడం, వినియోగించడం వల్ల గత ఏడాదితో పోల్చితే మహిళలపై నేరాల్లో భారీ తగ్గుదల నమోదైనట్లు వివరించారు. గత ఏడాది తొలి త్రైమాసికంలో మహిళలపై నేరాలకు సంబంధించి 185 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 136 కేసులు నమోదై, 27 శాతం తగ్గినట్లు తెలిపారు.
- ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. గత ఏడాది తొలి త్రైమాసికంలో 77 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది తొలి మూడు నెలల్లో 101 కేసులు నమోదు చేయడం జరిగిందని వివరించారు. నలుగురు ప్రధాన స్మగ్లర్లపై పి.డి.యాక్ట్ ప్రయోగించడం జరిగిందన్నారు.
- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా వుండాలని, సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.
- ఎక్కడైనా ఏదైనా సమస్య వున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, నేరాల నియంత్రణలో ప్రజలు తమ వంతు బాధ్యతగా పోలీసుశాఖకు సహకరించాలని వివరించారు.

కౌలు రైతు ఆత్మహత్య

ములకలచెరువు : అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. పర్తికోట గ్రామం ఆవులవారిపల్లెకు చెందిన బి. విశ్వనాథరెడ్డి(40) జీవనోపాధి కోసం బొలేరో వాహనాన్ని ఫైనాన్స్ కింద కొన్నాడు. ఇందుకు రూ.8 లక్షల అప్పు చేశాడు. ఆశించిన స్థాయిలో బాడుగలు రాక వాహనంపై తీసుకున్న ఫైనాన్స్ కట్టలేకపోయాడు. ఫైనాన్స్ కంపెనీ వారు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత స్వగ్రామంలో రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకున్నాడు. టమాట సాగు చేశాడు. వాటికి కూడా ధరలు లేక రూ.4 లక్షల అప్పు మిగిలింది. దీనికి తోడు మరో వైపు పిల్లల చదువులు భారం కావడం.. చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక మనస్తాపానికి గురయ్యాడు. దీంతో గురువారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పాము కాటుతో ఇద్దరికి అస్వస్థత

మదనపల్లె : పాముకాటుకు గురై ఇద్దరు తీవ్ర అస్వస్థత పాలైన సంఘటన శుక్రవారం మొలకలచెరువు, పీటీఎం మండలంలో జరిగాయి. మొలకలచెరువు మండలం బురకాయలకోట సెంట్రల్ స్కూల్ ఏరియాకు చెందిన శాంతమ్మ (50) కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. శుక్రవారం బాత్‌రూంలో ఉన్న నీటి డ్రమ్ములను శుభ్రం చేస్తుండగా అందులో దూరిన ఓ పాము కాటు వేసింది. అదే విధంగా పీటీఎం మండలం సీపీ పల్లెకు చెందిన శ్రీరాములు (52) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి ఇంటి వద్ద నడిచి వెళుతుండగా దారిలో ఓ విష సర్పం కాటు వేసింది. దీంతో బాధితులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికులు వారిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

బౌద్ధారామాల సందర్శన


అడపూర్ గుట్టపై దుండగులు ధ్వంసం చేసిన బౌద్ధారామాన్ని పరిశీలిస్తున్న ఇంటాక్ సభ్యులు

నందలూరు (రాజంపేట)/కడప కల్చరల్ : రాయలసీమలో తొలిసారిగా బయల్పడిన బౌద్ధరామాల వద్ద శుక్రవారం గౌతమ బుద్ధుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. బుద్దిస్ట్ కల్చరల్ సొసైటీ ఇంటాక్ చాప్టర్, లయన్స్‌క్లబ్, రాయలసీమ టూరిజం, యోగివేమన యూనివర్సిటీ, ఆర్కియాలజి డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. అనంతరం భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) సభ్యులు గుట్టపై గల గుహలను పరిశీలించారు. పైనుంచి రెండవ ఆరామం గుప్త నిధుల కోసం తవ్వేసి ఉండటాన్ని గమనించి ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటికే అక్కడికొచ్చిన కేంద్ర పురావస్తుశాఖ కన్జర్వేటర్ బాలకృష్ణ, స్వరూప్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భవిష్యత్తులో ఇలా జరగకుండా శాశ్వతంగా కంచె ఏర్పాటు చేయాలని ఇంటాక్ సభ్యులు కోరారు. ఇంటాక్ సంస్థ పూర్వ కన్వీనర్ ఎలియాస్‌రెడ్డి, ప్రస్తుత కన్వీనర్ చిన్నపరెడ్డి, సభ్యులు కొండారెడ్డి, జోజిరెడ్డి, సంజీవరెడ్డి, బుద్ధుని కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు పిల్ల కుమారస్వామి, సెక్రటరీ ప్రసాద్, ఉపాధ్యక్షులు అశోక్‌కుమార్, రాజేశ్వరమ్మ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జ్యోజిరెడ్డి, ఆడపూరు ఆశ్రమ నిర్వాహకులు రవీంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కోసం నిరసన

ఓబులవారిపల్లె : నూతన జాతీయ రహదారి భూసేకరణలో బలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రైతులకు పూర్తి పరిహారం ఇప్పించాలని శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేకరించిన భూమిలో కొంత భూమికే పరిహారం ఇస్తున్నారని తెలిపారు. అలాగే పొలంలోని బోర్లు, చెట్లకు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇటీవల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భూములు పరిశీలించి సర్వే నిర్వహించారని పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు పరిహారం ఇవ్వలేదని, వెంటనే ఇప్పించాలని కోరారు.

ఏపీ సీఎం కప్‌లో జిల్లా క్రీడాకారుల హవా


విజేతగా నిలిచిన ఫుట్‌బాల్ బాలికల జట్టు

కడప స్పోర్ట్స్ : తిరుపతి నగరంలో నిర్వహించిన ఏపీ సీఎం కప్ క్రీడాపోటీల్లో వైఎస్సార్ జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. టీమ్, వ్యక్తిగత విభాగాల్లో పతకాల పంట పండించారు. ఫుట్‌బాల్ బాలికల విభాగంలో స్టేట్ చాంపియన్‌గా నిలిచారు. అలాగే హ్యాండ్‌బాల్ బాలుర విభాగంలో రన్నరప్‌గా, హాకీ బాలుర విభాగంలో మూడవస్థానంలో నిలిచారు. బ్యాడ్మింటన్ బాలుర విభాగంలో రెండవ, బాలికల విభాగంలో మూడవ స్థానంలో నిలిచారు. టెన్నిస్ క్రీడాంశంలో బాలికలు రెండవ స్థానం, బాలురు మూడవ స్థానం పొందారు. దీంతోపాటు వెయిట్‌లిఫ్టింగ్ పురుషుల విభాగంలో ఒక స్వర్ణం, రెండు రజత పతకాలు, మహిళ విభాగంలో ఒక రజత పతకం సాధించారు. టెన్నిస్ మహిళల విభాగంలో రజతం, బాక్సింగ్ మహిళల విభాగంలో రజతం, పురుషుల విభాగంలో కాంస్యపతకం కైవసం చేసుకున్నారు. జిల్లా క్రీడాకారుల ప్రతిభ పట్ల స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ అమృతరాజ్ హర్షం వ్యక్తం చేశారు.

21 నుంచి జమ్మలమడుగు ఉరుసు


పోస్టర్లు విడుదల చేస్తున్న పీఠాధిపతి గౌస్‌పీరాఖాద్రీ

జమ్మలమడుగు : జమ్మలమడుగులో ఈ నెల 21వ తేది నుంచి జూన్ 4 వరకు ఉరుసు మహోత్సవాలు నిర్వహించనున్నారు. పట్టణంలోని పలగాడి వీధికి చెందిన కామిలే షరియత్ పీరే తరీఖత్ అల్లామ మౌల్వివ హాఫిజ్ తూగుట్లపల్లి జాగిర్‌దార్ హజరత్ సయ్యద్ షా బడేగౌస్‌పీరా ఖాద్రీ 91వ ఉరుసు మహోత్సవ పోస్టర్లను ఆస్థానయే గౌసియా పీఠాధిపతి, ప్రభుత్వ గెజిటెడ్ ఖాజీ సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ ఆవిష్కరించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆస్థానయే గౌసియాలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ ఈ ఏడాది ప్రతి ఏడాది జరిగే కార్యక్రమాలకు భిన్నంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. 21న ఆదివారం సాయంత్రం జెండావిష్కరణ కార్యక్రమంతో ఉరుసు ప్రారంభించడం జరుగుతుందన్నారు. 23న మంగళవారం ఉదయం గౌసియా షాదీఖానాలో కప్పింగ్ థెరఫి, 27న నాత్‌ఖ్వానీ, 28న ఉచిత వైద్య శిబిరం, 31 నుంచి బండలాగుడు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 1న రాత్రి 9 గంటలకు సర్వ మత పెద్దలచే ప్రసంగం, 2న పకీర్ల మేళాతాళాలతో గంధం ఊరేగింపు, 3న ఉరుసు, రాత్రి అన్నదానం, గొప్ప ఖవ్వాలి పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు, ప్రజలు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సయ్యద్‌షా కుతుబుద్దీన్ ఖాద్రీ, సయ్యద్‌షా ఆలీమోద్దీన్ ఖాద్రీ, కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, ట్రెజరర్ జహంగీర్, యాసీన్, ఎం.ఎం.బాషా, రజాక్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.240 కోట్లతో ఉచితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

తిరుపతి డిస్కం ఎస్ఈ కృష్ణారెడ్డి


వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

బి.కొత్తకోట : గతేడాది నవంబర్ నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వ్యవసాయ రైతాంగానికి ప్రభుత్వం ఉచితంగా రూ.240 కోట్లను వ్యయం చేసిందని డిస్కం తిరుపతి ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన బి.కొత్తకోటలో వ్యవసాయ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటును పరిశీలించారు. సాగుబోర్లకు మంజూరైన కనెక్షన్లు, వాటికి సంబంధించి నమోదు చేసిన రికార్డులతో పొలాల్లోకి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్, కనెక్షన్లు ఇస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 18 వేల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తులు అందగా, 16,500 కనెక్షన్లు ఇవ్వగా 1,340 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు చెప్పారు. ఒక్కో కనెక్షన్‌కు సర్వీసు, సామర్థ్యం బట్టి ట్రాన్స్‌ఫార్మర్, మూడు స్తంభాలను ఏర్పాటు చేశామని చెప్పారు. దీనికోసం ప్రభుత్వం 12 వేల ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసిందని చెప్పారు. వీటన్నింటిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని చెప్పారు. రైతులు ఒక్కో హార్స్‌పవర్‌కు రూ.1,100 డిపాజిట్ మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రైతులకు ఇచ్చే ట్రాన్స్‌ఫార్మర్, కనెక్షన్ ఇచ్చే మెటీరియల్ కలుపుకొని రూ.2 లక్షల వ్యయం అవుతుందని చెప్పారు. ఈ మొత్తం ప్రభుత్వమే భరించి రైతులపై రూ.240 కోట్ల భారం పడకుండా చేసిందన్నారు. సాగుకు తొమ్మిది గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంట మదనపల్లె ఈఈ రాజశేఖర్‌రెడ్డి, ఏఈ గిరిధర్, సిబ్బంది ఉన్నారు.

తేనెటీగల దాడిలో ఏడుగురికి తీవ్ర గాయాలు

మదనపల్లె : తేనెటీగల దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. వేంపల్లె గ్రామానికి చెందిన కృష్ణకాంత్ కుటుంబ సభ్యులు జంగాలపల్లె రోడ్డులోని అక్కదేవతల గుడిలో పూజ చేస్తున్నారు. పక్కనే కట్టెల పొయ్యి వెలిగించి ప్రసాదం తయారు చేసే క్రమంలో తేనె తెట్టుకు పొగ తగలడంతో తేనెటీగలు ఒక్కసారిగా జనాలపై దాడి చేశాయి. ఇందులో కృష్ణకాంత్ (34), అతని కుటుంబ సభ్యులు మాధురి (27), గీతాంజలి (17), భారతమ్మ (52), సూర్యప్రకాష్ (15), జాగృతి (7), హేత్వీ (3)లు తీవ్రంగా గాయపడ్డారు. మరి కొందరు తప్పించుకుని పరుగులు తీశారు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుల్ని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వారికి మెరుగైన చికిత్సలు అందించారు. వీరిలో మాధురి, గీతాంజలి పరిస్థితి విషమంగా మారడంతో ఆసుపత్రిలోని ఐసీయూ విభాగానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
695	187
61,054	18,069

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	12,210	▲	224
డోజోన్స్	33,580	▲	453
ఎఫ్‌టీఎస్ఈ 100	7,778	▲	76
డాక్స్	15,961	▲	227
షాంఘై	3,334	▽	16
నికాయ్ (మంగళవారం ముగింపు)	29,158	▲	35

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 గ్రాములు)		
61,923	▲	277
బంగారం (99.5 గ్రాములు)		
61,979	▲	279
వెండి (కిలో)		
76,794	▲	330

మనీ లాండరింగ్ పరిధిలోకి సీఏలు

- పీఎంఎల్‌ఏ కిందికి కాస్ట్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు
- అయిదు రకాల ఆర్థిక లావాదేవీలకు వర్తింపు
- కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫికేషన్

న్యూఢిల్లీ: నల్ల ధనం చలామణీ, మనీ లాండరింగ్ కార్యకలాపాలను నిరోధించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన కేంద్రం ఆ దిశగా మరో కీలక చర్య తీసుకుంది. బ్లాక్ మనీ చలామణీకి ఆస్కారం ఉండే అయిదు రకాల ఆర్థిక లావాదేవీలను, వాటిని క్లయింట్ల తరఫున నిర్వహించే చార్టర్డ్ అకౌంటెంట్లు, కాస్ట్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలను మనీ–లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) పరిధిలోకి చేర్చింది. దీంతో ఇకపై సదరు లావాదేవీలను నిర్వహించే సీఏలు, సీఎస్‌లు కూడా విచారణ ఎదుర్కొనాల్సి రానుంది. దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ మే 3న నోటిఫికేషన్ విడుదల చేసింది. స్థిరాస్తుల కొనుగోలు, విక్రయం; క్లయింట్ల డబ్బు, సెక్యూరిటీలు లేదా ఇతర ఆస్తుల నిర్వహణ; బ్యాంక్, సేవింగ్స్ లేదా సెక్యూరిటీస్ అకౌంట్ల నిర్వహణ; కంపెనీల ఏర్పాటు, నిర్వహణ కోసం నిధులు సమీకరించడంలో తోడ్పాటు; వ్యాపార సంస్థల కొనుగోళ్లు, విక్రయం.. మొదలైన అయిదు రకాల ఆర్థిక లావాదేవీలు ఇందులో ఉన్నాయి. పీఎంఎల్‌ఏ చట్టం 2002ను ప్రయోగించాల్సి వస్తే క్లయింట్ల స్థాయిలోనే సీఏలు కూడా జరిమానా, విచారణ ఎదుర్కొనాల్సి వస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. 'పీఎంఎల్‌ఏ నిబంధనలను అమలు చేస్తే క్లయింట్లతో సమానంగా సీఏలు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా లావాదేవీ జరిగినట్లుగా భావిస్తే ఆ విషయాన్ని సీఏలు వెంటనే నియంత్రణా సంస్థకు తెలియజేయాలి' అని వివరించాయి.

రిపోర్టింగ్ అధికారులుగా సీఏలు..

ఆయా లావాదేవీల విషయంలో సీఏలు ఇకపై నియంత్రణ సంస్థలకు తెలియజేయాల్సిన రిపోర్టింగ్ అధికారులుగా వ్యవహరించాల్సి ఉంటుందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) పేర్కొంది. సదరు లావాదేవీలు నిర్వహించే క్లయింట్లందరి వివరాలను సేకరించి (కేవైసీ), రికార్డులను నిర్వహించాల్సిన బాధ్యత వారిపై ఉంటుందని తెలిపింది. క్లయింట్ల తరఫున ఏయే ఆర్థిక లావాదేవీలు జరపకుండా నిషేధం ఉందనే దాని గురించి తమ సభ్యుల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఐసీఏఐ వివరించింది. కొత్త మార్పులు సరైన కోణంలో అమలయ్యేలా చూసేందుకు, వృత్తి నిపుణులు పోషించగలిగే పాత్ర అర్థమయ్యేలా వివరించేందుకు నియంత్రణ సంస్థలు, అధికారులతో కలిసి పనిచేయనున్నట్లు ఐసీఏఐ తెలిపింది. నల్ల ధనం కట్టడికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల పీఎంఎల్‌ఏ నిబంధనలను కఠినతరం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు .. రాజకీయాలతో ప్రమేయమున్న వ్యక్తుల (పీఈపీ) ఆర్థిక లావాదేవీలను రికార్డు చేయడాన్ని తప్పనిసరి చేసింది. అలాగే లాభాపేక్ష రహిత సంస్థల ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని కూడా ఆర్థిక సంస్థలు, రిపోర్టింగ్ ఏజెన్సీలు సేకరించాల్సి ఉంటోంది. ఇక వర్చువల్ అసెట్స్ లావాదేవీలు నిర్వహించే క్రిప్టో ఎక్స్ఛేంజీలు, మధ్యవర్తిత్వ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించే యూజర్ల వివరాలను సేకరించడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది.



ఒలెక్ట్రా ఆదాయం రూ. 376 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ. 376 కోట్ల ఆదాయం (కన్సాలిడేటెడ్)పై రూ. 27 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో ఆదాయం రూ. 271 కోట్లుగా, లాభం రూ. 18 కోట్లుగా నమోదైంది. ఇక పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం 84 శాతం ఎగిసి రూ. 594 కోట్ల నుంచి రూ. 1,091 కోట్లకు చేరింది. నికర లాభం 86 శాతం వృద్ధితో రూ. 35 కోట్ల నుంచి రూ. 66 కోట్లకు పెరిగింది. 2021–22లో 259 ఎలక్ట్రిక్ బస్సులు డెలివరీ చేయగా, 2022–23లో 117 శాతం అధికంగా 563 ఈ–బస్సులను అందించినట్లు సంస్థ తెలిపింది. మొత్తం 3,394 బస్సుల కోసం ఆర్డర్లు ఉన్నట్లు వివరించింది. ఎలక్ట్రిక్ టిప్పర్లను కూడా విక్రయించడం ప్రారంభించామని, క్యూ4లో 17 వాహనాలను డెలివరీ చేశామని పేర్కొంది. సరఫరా వ్యవస్థ, స్థూల పరిస్థితులపరమైన రిస్కులు నెలకొన్నప్పటికీ తాము తయారీ, సాంకేతిక సామర్థ్యాలను పెంచుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సీఎండీ కె.వి. ప్రదీప్ తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల విభాగంలో అగ్రగామిగా కొనసాగేందుకు ఇది తోడ్పడుతోందని ఆయన పేర్కొన్నారు.

పతంజలి 'వెయిట్‌గో' తో సత్ఫలితాలు

హైదరాబాద్: బరువు తగ్గించడంలో తాము అభివృద్ధి చేసిన 'దివ్య వెయిట్‌గో' సత్ఫలితాలను ఇస్తున్నట్లు పతంజలి రీసెర్చ్ ఫౌండేషన్ తెలిపింది. తేలిక పాటి వ్యాయామాలు చేస్తూ, ఈ ఆయుర్వేదిక్ ఔషధాన్ని వినియోగిస్తే శరీరంలోని కొలెస్ట్రాల్, గ్లూకోజ్, ఇన్సులిన్‌లను తగిన స్థాయిల్లో ఉండేలా చేస్తుందని ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ జర్నల్ 'బయోమెడిషన్ అండ్ ఫార్మాకో థెరపీ'లో ఈ ఔషధం పనితీరు గురించి ప్రచురితమైనట్లు వివరించింది.



ఫెడరల్ బ్యాంక్ లాభం హైజంప్

క్యూ4లో రూ. 954 కోట్లు

ముంబై: ప్రైవేట్ రంగ సంస్థ ఫెడరల్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 954 కోట్ల నికర లాభం ఆర్జించింది. 62 శాతం ఎగసింది. ఇది ఒక త్రైమాసికానికి బ్యాంక్ చరిత్రలోనే అత్యధికం కాగా.. ఇందుకు పెట్టుబడుల విక్రయ లాభాలు దోహదపడినట్లు బ్యాంక్ పేర్కొంది. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం 61 శాతం ఎగసి రూ. 3,165 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2021–22) రూ. 1,970 కోట్లు మాత్రమే ఆర్జించింది. కాగా.. క్యూ4లో నికర వడ్డీ ఆదాయం 25 శాతం పుంజుకుని రూ. 1,909 కోట్లను అధిగమించింది. ఇతర ఆదాయం 58 శాతం ఎగసి రూ. 734 కోట్లను తాకింది. దీంతో రికార్డ్ లాభం ఆర్జించినట్లు బ్యాంక్ వెల్లడించింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.78 శాతం నుంచి 2.35 శాతానికి తగ్గాయి.



సూచీలకు హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం షాక్..!

- వారాంతాన ఒక శాతం పతనమైన మార్కెట్
- సెన్సెక్స్ నష్టం 695 పాయింట్లు
- 18,100 దిగువకు నిఫ్టీ

ముంబై: ప్రైవేట్ రంగ దిగ్గజ కంపెనీలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ల ద్వయం 66% పతనంతో దేశీయ స్టాక్ సూచీలు శుక్రవారం భారీగా నష్టపోయాయి. విలీన ప్రక్రియ తర్వాత సుమారు 150 – 200 మిలియన్ డాలర్ల మేర అవుట్‌ఫ్లో ఉండొచ్చని ఎంఎస్‌సీఐ నివేదిక తెలపడంతో ఇరు కంపెనీల షేర్లు గడిచిన మూడేళ్లలో అతిపెద్ద నష్టాన్ని చవిచూశాయి. అలాగే అమెరికా బ్యాంకింగ్ సంక్షోభ భయాలు, వాల్ స్ట్రీట్ నుంచి బలహీన సంకేతాలు, ఈసీబీ పావుశాతం వడ్డీరేట్ల పెంపుతో పాటు వారాంతపు రోజు కావడంతో ట్రేడర్లు కీలక కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటం సెంటిమెంట్‌పై మరింత ఒత్తిడిని పెంచాయి. సెన్సెక్స్ ఉదయం 586 పాయింట్ల నష్టంతో 61,163 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో ఒక దశలో 747 పాయింట్లు క్షీణించి 61,002 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 696 పాయింట్లు నష్టపోయి 61,054 వద్ద ముగిసింది. నిఫ్టీ 139 పాయింట్ల పతనంతో 18,117 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 18,217 – 18,055 పరిధిలో కదలాడింది. ఆఖరికి 187 పాయింట్లు నష్టపోయి 18,069 వద్ద నిలిచింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, మెటల్, మీడియా, ఐటీ రంగాల షేర్లకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్ల పతనంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.50%, 0.30% చొప్పున నష్టపోయాయి. కాగా ఆటో, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్ రంగాల షేర్లకు స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియా మార్కెట్లు మిశ్రమంగానూ, యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి. బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.43 లక్షల కోట్లు హరించుకుపోయింది.

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 5.63% పతనంతో రూ.1625 వద్ద నిలిచింది. బ్యాంక్ రూ.56,228 కోట్ల మార్కెట్ క్యాప్ కోల్పోయింది. హెచ్‌డీఎఫ్‌సీ 5.84% నష్టంతో రూ.1625 వద్ద క్లోజైంది. రూ.29,572 కోట్ల మార్కెట్ క్యాప్ ఆవిరైంది.



బంగారం డిమాండ్‌కు ధర సెగ

- భారత్ వినియోగదారుల కొనుగోళ్లు వాయిదా
- జనవరి–మార్చిలో డిమాండ్ 17 శాతం డౌన్
- ప్రపంచ స్వర్ణ మండలి నివేదిక

ముంబై: దేశంలో బంగారం ధరలు తీవ్ర స్థాయికి చేరడంతో, జనవరి–మార్చి త్రైమాసికంలో డిమాండ్ భారీగా 17 శాతం పడిపోయింది. వినియోగదారులు తీవ్ర ధరల కారణంగా కొనుగోళ్లను వాయిదా వేసుకునే పరిస్థితి నెలకొంది. 'మొదటి త్రైమాసికంలో పసిడి డిమాండ్ ట్రెండ్స్' పేరుతో ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) విడుదల చేసిన ఒక నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు...

- ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో భారత్ పసిడి డిమాండ్ 112.5 టన్నులు. 2022 ఇదే కాలంలో ఈ విలువ 135.5 టన్నులు.
- పసిడి ఆభరణాల డిమాండ్ ఇదే కాలంలో 94.2 టన్నుల నుంచి 78 టన్నులకు పడిపోయింది. 2010 నుంచి ఒక్క మహమ్మారి కరోనా కాలాన్ని మినహాయిస్తే పసిడి ఆభరణాల డిమాండ్ మొదటి త్రైమాసికంలో 100 టన్నుల దిగువకు పడిపోవడం ఇది నాల్గవసారి.
- విలువల రూపంలో చూస్తే, మొత్తంగా పసిడి కొనుగోళ్లు 9 శాతం క్షీణించి రూ.61,540 కోట్ల నుంచి రూ.56,220 కోట్లకు పడిపోయాయి.
- ఒక్క ఆభరణాల డిమాండ్ విలువల్లో చూస్తే, 9 శాతం పడిపోయి రూ.42,800 కోట్ల నుంచి రూ.39,000 కోట్లకు పడిపోయాయి.
- పెట్టుబడుల పరిమాణం పరంగా డిమాండ్ (కడ్డీలు, నాణేలు) 17 శాతం తగ్గి 41.3 టన్నుల నుంచి 34.4 టన్నులకు క్షీణించింది.

ప్రపంచ పసిడి డిమాండ్ కూడా మైనస్సే..

ఇదిలావుండగా, ప్రపంచ వ్యాప్తంగా కూడా పసిడి డిమాండ్ మొదటి త్రైమాసికంలో బలహీనంగానే నమోదయ్యింది. 13 శాతం క్షీణతతో ఈ పరిమాణం 1,080.8 టన్నులుగా ఉంది.



రూపాయి ఎఫెక్ట్...



పసిడి ధరలు పెరడానికి అంతర్జాతీయ అంశాలు ప్రధాన కారణంగా కనబడుతున్నాయి. ముఖ్యంగా ఇక్కడ అమెరికా సెంట్రల్ బ్యాంక్– ఫెడ్ ఫండ్ రేటు పెరుగుదలను ప్రస్తావించుకోవాల్సి ఉంటుంది. డాలర్ బలోపేతం, రూపాయి బలహీనత వంటి కారణాలతో గత ఏడాదితో పోల్చితే పసిడి ధర 19 శాతం పెరిగింది. పసిడి 10 గ్రాముల (స్వచ్ఛత) ధర రూ.60,000 పైన నిలకడగా కొనసాగుతోంది. ధర తీవ్రతతో తప్పనిసరి పసిడి అవసరాలకు వినియోగదారులు తమ పాత ఆభరణాల రీసైక్లింగ్, తద్వారా కొత్త కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పెట్టుబడులకు సంబంధించి డిజిటల్ గోల్డ్ ప్లాట్‌ఫామ్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ విభాగంలో కొనుగోళ్ల పరిమాణాలు కొంత మెరుగుపడుతున్నాయి. డిమాండ్ వార్షికంగా 750 నుంచి 800 టన్నులు శ్రేణిలో నమోదుకావచ్చు.

– సోమసుందరం, డబ్ల్యూజీసీ భారత్ రీజినల్ సీఈఓ.

లైఫ్@360

మే ఎండలు మండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆరోగ్య నిపుణులు, అనుభవజ్ఞులు చెప్పిన చిట్కాలు...

• వడదెబ్బ
జాగ్రత్త పడదాం ఇలా...



ఎండల ధాటికి వడదెబ్బ ప్రభావం శరీరంపై పడే అవకాశం ఉంది. శరీరంలో నీటిశాతం తగ్గితే, వడదెబ్బ తగులుతుంది. అందువల్ల వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గకుండా చూసుకోవాలి. ఇంకా ఎండల్లో ఎక్కువ తిరగకుండా ఉండాలి. అధికంగా ఎండలో తిరగటంతో రక్తకణాలు కుంచించుకు పోతాయి. దీనిమూలంగా కిడ్నీలు, లివర్ దెబ్బతింటాయి. అందువల్ల కొన్ని రకాల జాగ్రత్తలు పాటించడం అవసరం.

ఎలా గుర్తించాలి?

● చర్మం పొడిబారుతుంది. కళ్లు మంటలు రావడం, గుంజినట్లు అవడం జరుగుతుంది. ● శరీరంలో నీటి శాతం లోపిస్తుంది. శరీరం అదుపుతప్పుతుంది. ● నీరసంగా అనిపిస్తుంది. కొందరికి కళ్లు లాగుతాయి. తలనొప్పి వస్తుంది. ● వడదెబ్బ ప్రభావం ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు అవుతాయి. ● శరీర ఉష్ణోగ్రత బాగా పెరుగుతుంది. జ్వరం వస్తుంది. ● దాహం ఎక్కువగా ఉంటుంది. తల తిరగడం, మతి కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికి ముప్పు ఏర్పడుతుంది.

ఎవరిపై ఎక్కువ ప్రభావం?

60 సంవత్సరాలు పైబడిన వారు, చిన్నారులు, క్రీడాకారులు, గర్భిణులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవాళ్లు, స్థూలకాయులు, మద్యం ఎక్కువగా తాగే వాళ్లు, అతిగా ఔషధాలు తీసుకొనేవారు జాగ్రత్తగా ఉండాలి. వేసవి లో ఎక్కువ సేపు ఎండలో పనిచేసే కూలీలు, కార్మికులు, ఉద్యోగులకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టి వారు చాలా జాగ్రత్తగా ఉండాలి.

ముందుజాగ్రత్తలు ఏమిటి?

● ప్రతిరోజు మజ్జిగ, నిమ్మరసం తీసుకోవాలి. ● ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు క్యాప్ పెట్టుకోవాలి. గొడుగు తీసుకెళ్లాలి. ● రోజుకు ఐదారు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి. ● సమయానికి తగిన ఆహారం తీసుకోవాలి. ● ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలి. ● వదులైన కాటన్ దుస్తులు ధరించాలి. ● నూనె పదార్థాల వాడకం తగ్గించాలి. ● కొబ్బరి బోండాం, మజ్జిగ తాగండి. ● బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా సన్‌గ్లాసెస్ పెట్టుకోవాలి. ● అలాగే నీళ్ల బాటిల్ తీసుకెళ్లండి. ● మధ్యాహ్నం 12 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరగకూడదు. ● కీరదోస ముక్కల్ని ఎక్కువగా తినడంవల్ల శరీరానికి నీటితోపాటు పోషకాలు కూడా అందుతాయి. మలబద్ధక సమస్య కూడా తగ్గుతుంది. ● శరీరంలో నీటిశాతాన్ని పెంచే పుచ్చకాయ, కొబ్బరినీళ్లు తాగాలి. ● వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఉల్లిపాయను మెత్తగా నూరి శరీరానికి రాయాలి. ● జీలకర్ర దోరగా వేయించి పొడిచేయండి. అర స్పూన్ పొడిని గ్లాసు నిమ్మరసంలో కలిపి ఉప్పు, పంచదార వేసుకొని తాగితే శరీరానికి బోలెడంత ఎనర్జీ వస్తుంది. ● ఈ కాలంలో సలాడ్స్, తాజా కాయగూరలు, పండ్ల రసాలు తీసుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది.



వడదెబ్బ తగిలితే ఏం చేయాలి?

● నీరుల్లిపాయ రసం రెండు కణతలకు, ఛాతీమీద పూస్తే వడదెబ్బ తగలడం వలన కలిగిన బాధలు తగ్గుతాయి. ● వడదెబ్బ తగిలిన వారి ముఖం మీద, ఒంటిమీద నీళ్ల చల్లుతూ ఉండాలి. నిమ్మరసంలో ఉప్పు కలిపి ఇవ్వాలి. ● కుమ్మున ఉడికించిన మామిడికాయ రసంలో ఉప్పు, జీలకర్ర కలిపి తాగుతుంటే వడదెబ్బ తగలదు. ● శరీరం మీద ఉన్న దుస్తులను వదులు చేసి విశ్రాంతిగా పడుకోనివ్వాలి. ● గ్లాసు నీళ్లలో స్పూను తేనె కలిపి ఇస్తే ఉపహనం కలుగుతుంది. ● తరువాణి తేటలో ఉప్పును చేర్చి ఇవ్వాలి. ● లేత తాటిముంజలను పంచదారతో కలిపి తినిపించాలి. ● నాలుకకు పాత ఉసిరిక పచ్చడి రాసి పుల్లని మజ్జిగలో ఉప్పువేసి అన్నంలో పోసి పిసికి పిప్పిని పారవేసి ఆ రసాన్ని తాగించాలి. ● వేడివేడి పలచటి గంజిలో ఉప్పు వేసి తాగించాలి. ● బయటకు వెళ్లేటప్పుడు ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజ్ కలిపిన నీరు లేదా ఓఆర్ఎస్ ద్రావణం తాగడం మంచిది. ● వీలయినంత వరకు ఎండవేళలో బయటికి వెళ్లకుండా ఉండటం ఉత్తమం. తప్పనిసరిగా వెళ్లవలసి వస్తే, గొడుగు వాడాలి లేదా కనీసం నెత్తిన టోపీ లేదా రుమాలు పెట్టుకుని ఉంటే కొంత ఉపశమనం కలుగుతుంది.





వేసవిలో మనకు అధికంగా దొరికే పండు ఖర్బూజ పండు. ఈ పండులో అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. కర్బూజలో దాదాపు తొంభై శాతం నీరు ఉంటుంది. కాబట్టి వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి, వేసవిలో శరీరం కోల్పోయే నీటిని తిరిగి అందించడంలో కర్బూజపండు బాగా ఉపయోగపడుతుంది. ఈ పండు ముఖ్యంగా శరీరంలోని వేడిని తగ్గిస్తుంది. అధిక రక్తపోటుని తగ్గిస్తుంది. ఈ పండులో ఉన్న పోషక విలువలేంటో తెలుసుకుందాం.



కర్బూజ
పండంటి ఆరోగ్యం

- కర్బూజ పండులో ఎక్కువ శాతంగా ఉండే బీటాకెరోటిన్, విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు శరీరంలోని తెల్ల రక్తకణాలను వృద్ధి చెందేలా చేసి రక్తంలో ఇన్ఫెక్షన్స్ రాకుండా కాపాడతాయి.
- కర్బూజలో విటమిన్ ఎ ఎక్కువగా ఉండటం వల్ల కంటి సంబంధిత సమస్యలను దూరం చేసి కంటిచూపు బాగా ఉండేలా చేస్తుంది. వడదెబ్బ నుండి రక్షిస్తుంది.
- కర్బూజ పండులో విటమిన్ కె, విటమిన్ ఇ ఎక్కువగా ఉంటుంది. దీనివలన ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. అంతేకాకుండా రక్త ప్రసరణ చక్కగా పని చేసేలా ఉపయోగపడుతుంది.
- ఈ పండులో అధిక మోతాదులో పొటాషియం ఉండటం వలన గుండెకు మంచి న్యూట్రియన్స్‌ని అందజేస్తుంది. దీనిలో ఫోలేట్ ఉండటం వలన అది హార్ట్ ఎటాక్ నుండి, గుండె జబ్బుల నుండి కాపాడుతుంది.
- తక్కువ క్యాలరీస్, ఎక్కువ పీచు పదార్థం ఉండటం వలన అధిక బరువుని తగ్గిస్తుంది.
- ఖర్బూజ జ్యూస్ తాగడం వలన మెదడుకి ఆక్సిజన్ సరఫరా బాగా జరిగి, ఒత్తిడి తగ్గి నిద్ర బాగా పడుతుంది. ఈ జ్యూస్‌ని క్రమం తప్పకుండా సేవిస్తే రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది.
- ఈ పండు కిడ్నీలో రాళ్లను సైతం కరిగిస్తుంది. జీర్ణ శక్తిని మెరుగుపరుస్తుంది.
- ఫోలిక్ యాసిడ్ సమృద్ధిగా ఉండడం గర్భిణులకు ఎంతో మేలు చేస్తుంది. బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతుంది.
- కంటి ఆరోగ్యం, శ్లేష్మాన్ని తగ్గించడానికి కర్బూజా సహాయపడుతుంది. వేసవిలో కర్బూజ పండు ముక్కలతోపాటు జ్యూస్ తాగటం వల్ల మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చు.

పోయిందనుకున్న కోవిడ్ ఇప్పుడు మళ్లీ ప్రభావం చూపిస్తోంది. కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే భయ పడాల్సిందేమీ లేదు. ఎందుకంటే రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే ఒక్క కరోనానే కాదు, ఎన్నో అంటువ్యాధులు, ఇతర రోగాలు వచ్చే అవకాశం ఉంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి ఏం చేయాలో తెలుసుకుందాం.



వ్యాధులనుంచి కాపాడుకుందాం

ఆరోగ్యకరమైన ఆహారం మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. పండ్లు, కూరగాయల్లో విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. ఈ ఆహారాలు రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడతాయి. మాంసం, బీన్స్ వంటి ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీర పనితీరును మెరుగుపరుస్తాయి. పసుపు, అల్లం, నిమ్మరసం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. అందువల్ల ఆహారంలో అవి ఉండేలా చూసుకోవడం మంచిది.

వ్యాయామం

క్రమం తప్పకుండా చేసే ఏ తేలికపాటి వ్యాయామం అయినా సరే,రోగనిరోధకతను పెంచుతుంది. అందువల్ల ఏమీ చేయలేకపోయినా, కనీసం నడవడం వల్ల అయినా శరీరమంతటికీ రక్తప్రసరణ పెరుగుతుంది. అన్ని కణాలకూ ఆక్సిజన్ అందుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.

ఒత్తిడి లేకుండా చూసుకోవాలి

ఒత్తిడి రోగనిరోధక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది మన శరీరంలో కార్టిసాల్ ఉత్పత్తిని పెంచుతుంది. ఇది రోగనిరోధక ప్రతిస్పందనను నెమ్మదింపజేస్తుంది. ధ్యానం, లోతైన శ్వాస వ్యాయామాలు, యోగా వంటివి ఒత్తిడిని తగ్గించడానికి, రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి సహాయపడతాయి.

ద్రవపదార్థాలు

మంచి ఆరోగ్యానికి, బలమైన రోగనిరోధక వ్యవస్థ బలంగా ఉండేందుకు శరీరం హైడ్రేటెడ్‌గా ఉండటం చాలా ముఖ్యం. నీరు శరీరం నుంచి విషాన్ని బయటకు పంపడానికి సహాయపడుతుంది. రోగనిరోధక వ్యవస్థ సమర్థంగా పనిచేయడానికి నీరు ఎంతో సహాయపడుతుంది.

సరిపడా నిద్ర

ఆరోగ్యం బాగుండాలంటే తగినంత నిద్ర చాలా అవసరం. నిద్ర లేకపోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గడంతో పాటుగా ఎన్నోరకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. తక్కువ నిద్ర పోయేవారికి తొందరగా జలుబు లేదా ఫ్లూ వచ్చే అవకాశం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. సామాజిక దూరాన్ని, శుచి, శుభ్రతలను పాటిస్తూ ఉండటం, జనసమూహంలోకి వెళ్లినప్పుడు మాస్కులు వేసుకోవడం అవసరం. ఈ విధమైన జాగ్రత్తలు తీసుకుంటే కోవిడ్ ఒక్కటే కాదు, ఇతర ఆరోగ్య సమస్యలు కూడా తొందరగా దరిచేరవు.